క్లుప్తంగా

ఘనంగా గజ్జెల పూజ



ఏలేశ్వరంలో గజ్జెల పూజ చేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు గురువారం పట్టణంలో గజ్జెల పూజ నిర్వహించారు. కళాభారతి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నిర్వాహకురాలు కొప్పిశెట్టి సుచిత్ర ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో అర్చకుడు మహేష్ విద్యార్థులతో గణపతి పూజ, గజ్జెల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సుచిత్ర మాట్లాడుతూ సుమారు 30 మంది విద్యార్థులు మూడు నెలల పాటు శిక్షణ తీసుకుని గజ్జెల పూజ చేశారన్నారు. ఈ పూజ తర్వాత విద్యార్థులు డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు వెంకటేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనాథలకు రగ్గుల పంపిణీ



ఏలేశ్వరంలో అనాథ పిల్లలకు రగ్గులు పంపిణీ చేస్తున్న దాత సూర్యకుమారి

ఏలేశ్వరం: పట్టణంలో అనాథ పిల్లలకు గురువారం రగ్గులు పంపిణీ చేశారు. స్థానిక శ్రీస్వామి దయానంద సరస్వతీ ఆశ్రమంలో సుమారు 30 మంది పిల్లలకు రగ్గులు అందజేశారు. పట్టణానికి చెందిన వాగు సూర్యకుమారి ఆర్థిక సాయంతో అనాథలకు వీటిని పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా అనాథ పిల్లలకు రగ్గులు పంపిణీ చేసినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం వెల్లివిరిసింది

జగ్గంపేట: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం వెల్లివిరిసిందని, అక్కడ ప్రజలు ఇంతకాలానికి ప్రశాంతంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. సంక్షేమ పాలనకు అక్కడ ప్రజలు పట్టం కట్టారని, దీనిపై వైఎస్సార్ సీపీ లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన పాలనతో ఏవిధంగా ప్రజల హృదయాలను గెలుచుకున్నారో చూసి తన తండ్రి బాటలో జగన్‌మోహన్‌రెడ్డి నడవాలని హితవుపలికారు.

ఉచిత రక్తదాన శిబిరం



పెదశంకర్లపూడిలో పాఠశాలలకు ఫ్యాన్లు బహూకరిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు ఆవరణలో గురువారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ వరుపుల రాజా జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. సుమారు 250 మంది రక్తదానం చేశారు. మండలంలోని పలు పాఠశాలలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. పెదశంకర్లపూడిలోని మండల పరిషత్, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం ప్లేట్లు, గ్లాసులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. తొలుత పెదశంకర్లపూడిలోని రాజా ఘాట్ వద్ద, ప్రత్తిపాడులో రాజా విగ్రహం వద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నివాళులర్పించారు. స్థానిక నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, సరిపల్లి రాజేష్, మేడిశెట్టి సూర్యకిరణ్ పాల్గొన్నారు. మండలంలోని కిత్తమూరిపేట గిరిజన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యాపారవేత్త రెడ్డి అమర్నాథ్ ఆర్థిక సహాయంతో ఉచితంగా కంచాలను పంపిణీ చేశారు. పాఠశాలకు 20 కుర్చీలను బహూకరించారు.

జోరుగా.. హుషారుగా..

- విస్తారంగా వర్షాలు
- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- నిండుకుండల్లా మారిన చెరువులు, జలాశయాలు
- 375.2 అడుగులకు చేరిన తాండవ నీటిమట్టం



కాకరాపల్లిలో నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

కోటనందూరు: గత నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో మెట్టలో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. ఏలేరు, పంపా, తాండవ జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ప్రస్తుతం వర్షపునీటితో పంట పొలాలు చెరువులను తలపిస్తుండడంతో రైతులు ఖరీఫ్ సాగు పనులను ముమ్మరం చేశారు. మరో వారం రోజుల్లో వరినాట్లు పూర్తయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, నిండుకుండల్లా మారిన జలాశయాలతో ఖరీఫ్ సాగుకు ఢోకా లేదని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తాండవకు జలకళ

తాండవ జలాశయం సాగునీటితో కళకళలాడుతోంది. ఈ జలాశయం నుంచి కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో 51,465 ఎకరాలకు సాగునీరు అందుతోంది. కాకినాడ జిల్లాలో కుడి ప్రధాన కాలువ ద్వారా 11,391 ఎకరాలు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 7,385 ఎకరాలు మొత్తం 18,776 ఎకరాలకు, అనకాపల్లి జిల్లాలో ఎడమ ప్రధాన కాలువ నుంచి 25,440 ఎకరాలు, కుడి ప్రధాన కాలువ ద్వారా 7,249 ఎకరాలు మొత్తం 32,689 ఎకరాలకు సాగునీరు సరఫరా జరుగుతోంది. జలాశయ గరిష్ట నీటిమట్టం 380 అడుగులు కాగా కనిష్ట నీటిమట్టం 340 అడుగులు. ప్రస్తుతం జలాశయంలో 375.2అడుగుల నీటిమట్టం ఉంది.

నదికి నీటిని విడుదల చేసే అవకాశం

అల్పపీడన ప్రభావంతో క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో తాండవ జలాశయం తొణికిసలాడుతోంది. ప్రాజెక్టులో నీటి నిల్వలు దాదాపుగా గరిష్ట స్థాయికి చేరాయి. తుపాను హెచ్చరిక నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కొనసాగితే ఏ క్షణంలోనైనా జలాశయం నుంచి నీటిని నది గుండా సముద్రానికి విడిచిపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. జలాశయానికి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా నదికి నీటివిడుదలపై నిర్ణయం తీసుకుంటామని తాండవ అధికారులు చెబుతున్నారు. తాండవనది పరివాహక ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా..

రెండు దశాబ్దాలుగా ప్రాజెక్టు పరిస్థితిని గమనిస్తే ప్రతి ఏడాది ఆగస్టు రెండు లేదా మూడో వారాల్లో నీటిని విడుదల చేసేవారు. ఆ సమయంలో ప్రాజెక్టులో నీటి నిల్వలు కనిష్ట స్థాయిలో మాత్రమే ఉండేవి. రైతుల అవసరాల కోసం తప్పనిసరి పరిస్థితుల్లో వరుణిడిపై భారం వేసి అధికారులు నీటి విడుదలకు శ్రీకారం చుట్టేవారు. ఈ ఏడాది పరిస్థితి గతానికి పూర్తి భిన్నం. ఖరీఫ్ ఆరంభంలో అంతంత మాత్రంగానే ఉన్న నీటినిల్వలు రెట్టింపు వర్షాలతో ఒక్కసారిగా గరిష్ట స్థాయికి చేరాయి. ఇక మీదట కాలం గడ్డు పోయినా ఖరీఫ్‌కు ఢోకా ఉండదు. రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తాండవ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

క్యాచ్‌మెంటు ఏరియాలో విస్తారంగా వర్షాలు

అనకాపల్లి జిల్లా అటవీప్రాంతంలో ఉన్న ప్రాజెక్టు క్యాచ్‌మెంటు ఏరియా సారిక మల్లవరం, జోగంపేట, యాసర కొత్తూరు, అమ్మపేట, గాదంపాలెం, గంటావారి కొత్తగూడెం ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం వర్షాలు భారీగా కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో భారీగా వస్తుందని తాండవ అధికారులు చెబుతున్నారు.

మెట్ట గ్రామాల్లో జోరుగా నాట్లు

తాండవ జలాశయం నుంచి ఆయకట్టు అవసరాలకు నీటిని విడుదల చేయడం, విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని మెట్ట గ్రామాలైన భీమవరపుకోట, ఎస్సార్ పేట, అప్పలరాజుపేట, బిళ్లనందూరు, ఇండుగపల్లి, బొద్దవరం, పాత కొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం గ్రామాల్లో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. కొన్ని గ్రామాల్లో దమ్ములు చేస్తుంటుండగా మరికొన్ని గ్రామాల్లో నాట్లు వేస్తున్నారు. పల్లపు గ్రామాలైన కోటనందూరు, కాకరాపల్లి, అల్లిపూడి, కేఏ మల్లవరం, ఎల్లీపేట, కొత్తకొట్టాం గ్రామాల్లో దాదాపుగా నాట్ల ప్రక్రియ ముగింపు దశకు చేరింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



క్యాచ్‌మెంట్ ఏరియాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు జలాశయంలో నీటి నిల్వలు గరిష్ట స్థాయికి చేరాయి. వర్షం కొనసాగితే ప్రాజెక్టు భద్రత దృష్ట్యా ఏ సమయంలోనైనా స్పిల్ వే ద్వారా నీటిని సముద్రానికి విడుదల చేసే అవకాశం ఉంది. తాండవ నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలెవరూ నది ఒడ్డుకు వెళ్లకూడదు. పశుపక్ష్యాదులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలి.

అనురాధ, డీఈఈ, తాండవప్రాజెక్టు



సాగు నీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రౌతులపూడి: ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున కూరగాయలు సాగు చేపట్టే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవనశాఖ అధికారి దివ్యశ్రీ సూచించారు. మండలంలో టమాటా, వంగ, మిరప, తీగజాతి కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతి కూరగాయల సాగు చేసిన రైతులకు గురువారం ఆమె పలు సూచనలు చేశారు. పొలంలో నిలచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు. వర్షాలు ఆగిన వెంటనే యూరియా వంటి పోషకాలను పిచికారీ చేయాలన్నారు. అవసరాన్ని బట్టి సూక్ష్మ పోషకాలను పిచికారీ చేయాలని సూచించారు. నేల ఆరిన తరువాత రసాయనిక ఎరువులు వేసుకోవాలన్నారు. వర్షాలను ఆగిన వెంటనే కలుపు తీయాలన్నారు. కూరగాయలు సాగు చేసే రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

గోతులు పూడ్చివేత



మెటల్ బూడిదతో గోతులు పూడ్చుతున్న దృశ్యం

కిర్లంపూడి: జగపతినగరం నుంచి ప్రత్తిపాడు వెళ్లే ప్రధాన రహదారిపై భారీగా గోతులు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత స్పందించారు. సర్పంచ్ ఆదేశాలతో సిబ్బంది గురువారం ట్రాక్టర్‌తో నల్లమెటల్, బూడిద వేసి గోతులు పూడ్చారు. వార్డు సభ్యుడు గుడాల రాంబాబు పనులు పర్యవేక్షించారు. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తీరు మారకపోతే కఠిన చర్యలు

సాక్షి ఇంపాక్ట్

గండేపల్లి: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల తీరు మారకపోతే చర్యలు తప్పవని డీవైఈఓ ప్రభాకర్ హెచ్చరించారు. విద్యార్థుల ఆకలి కేకలు శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని తాళ్లూరు ఎంపీపీ స్కూల్‌లో తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల హాజరు శాతం, మెనూ పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి, నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కడుపునిండా భోజనం పెట్టాలని సూచించారు. భోజనం తయారీలో రుచి, సుచి, నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని ఆదేశించారు. మరోసారి ఇదేవిధంగా జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈఓ-2 వెంకటరెడ్డి, హెచ్‌ఎం డి.నాగమణి, ఉపాధ్యాయురాలు మాధవి, తదితరులు ఉన్నారు.



తాళ్లూరులో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో మాట్లాడుతున్న డీవైఈఓ ప్రభాకర్

వరిసాగుపై రైతులకు శిక్షణ



అల్లిపూడిలో రైతులతో మాట్లాతున్న ఏఓ చంద్రశేఖర్



అరెంపూడిలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ గాంధీ

కోటనందూరు: మండలంలోని అల్లిపూడిలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరిసాగుపై రైతులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ వరిసాగులో నీరు, ఎరువుల యాజమాన్యం అత్యంత కీలకమన్నారు. మితిమీరిన రసాయనిక ఎరువులతో పంటకు, భూమికి నష్టం వాటిల్లుతుందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా సాగులో సూక్ష్మపోషకాలను వినియోగించాలని సూచించారు. ఏఈఓలు జగ్గప్పారావు, సురేష్, వీఏఏలు వెంకటేష్, శ్రావణి పాల్గొన్నారు.

మోతాదుకు మించితే ముప్పు

శంఖవరం: పంటల సాగులో మోతాదుకు మించి విచక్షణా రహితంగా పురుగుల మందులు వాడితే పంటలకు నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని అరెంపూడిలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పురుగుల మందుల పిచికారీ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వరి నారు మడుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం వరి నారు మడులను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏ జగదీష్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



మర్లపాడులో పోలవరం కాలువ వంతెన వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

తుని రూరల్: మండలంలోని మర్లపాడు సమీపంలో పోలవరం కాలువ వంతెన వద్ద విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. వంతెనకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నాయకుడు వడ్డాది యేసుబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలువపై వంతెన నిర్మించారని, 50 అడుగుల దూరంలో ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించలేదన్నారు. వంతెన దిగిన వెంటనే స్తంభాలు ఉండడం, మలుపు తిరగాల్సి రావడం కష్టంగా ఉందని వాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల నుంచి తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానానికి వెళ్లే ప్రధాన రహదారి ఇదే కావడంతో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. 11 కేవీ విద్యుత్ లైను కావడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ



జాన్ వెస్లీ

జగ్గంపేట: వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని, దీనిలో ఎన్నికల కమిషన్ ప్రధాన పాత్ర వహించిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు జాన్ వెస్లీ అన్నారు. జగ్గంపేటలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ దుర్మార్గంగా జెడ్పీటీసీ ఎన్నికల్లో వ్యవహరించిందన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో ఉన్నారని, ఆయన చేసిన మేలును పేదలు మరవరన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో రిగ్గింగ్‌తో గెలిచిన కూటమి ప్రభుత్వం దానిని గొప్పగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అది బలుపు కాదు వాపు అన్న విషయం త్వరలోనే తెలుస్తుందని తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు

జగ్గంపేట: గ్రామానికి చెందిన జూడో విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తన క్యాంపు కార్యాలయంలో గురువారం అభినందించారు. గుంటూరులో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బి.తేజస్విని గోల్డ్‌మెడల్, కె.ఏసురాజు సిల్వర్ మెడల్, బి.నిఖిల్, సాత్విక్, టి.వైష్ణవి, పి.జైపాల్ రజత పతకాలు సాధించినట్టు కోచ్ వెంకటరమణ తెలిపారు.

ఇవండీ.. సంగోతులు !



గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారిన బలరామపురం-ఎస్.అగ్రహారం రహదారి

రౌతులపూడి: మండలంలోని బలరామపురం నుంచి ఎ.మల్లవరం మీదుగా ఎస్.అగ్రహారం వెళ్లే రహదారి పూర్తిగా ఛిద్రమైంది. సుమారు ఎనిమిది కిలోమీటర్లు ఉన్న ఈ రహదారి 20 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి రహదారి పునర్నిర్మించకపోవడంతో పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా మారింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు మరమ్మతులకు గురవుతున్నాయి. రాత్రి వేళల్లో ఈ మార్గంలో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. పెద్ద పెద్ద గోతుల కారణంగా వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గురుకుల పాఠశాల సందర్శన



గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోత్స్న

గోకవరం: మండలంలోని వీరలంకపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యురాలు, తూర్పుగోదావరి జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షురాలు గుర్రాల జ్యోత్స్న సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల వసతి, భోజన వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరుశాతం, సిబ్బంది వివరాలను ప్రిన్సిపాల్‌ను ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధం



ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు

ప్రత్తిపాడు: స్వాతంత్య్ర వేడుకలకు సర్వం సిద్ధమైంది. పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను సుందరంగా ముస్తాబు చేశారు. ప్రత్తిపాడులోని మండల పరిషత్, తహసీల్దార్, విద్యాశాఖ, సబ్ రిజిస్ట్రార్, పోలీస్ స్టేషన్ తదితర కార్యాలయాలతో పాటు విద్యాసంస్థల్లో కూడా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. రంగురంగుల కాగితాలతో కార్యాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. కాగా స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు విద్యాసంస్థల్లో గురువారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. మండలంలోని ప్రత్తిపాడు, ఏలూరు, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడా పోటీలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు.

నేడు స్వాతంత్య్ర వేడుకలు

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్య్ర వేడుకలు, జెండా వందనం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు జాతీయ జెండాను ఎగురవేస్తారన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బార్ కాదండోయ్.. సచివాలయ భవనం



ప్రత్తిపాడు సచివాలయం-3 భవనంలో తాగిపడేసిన బీర్ బాటిల్స్

ప్రత్తిపాడు: ఈ ఫొటో చూసి ఇదేదో బార్ అనుకుంటే పప్పులో కాలేసినట్టే. ప్రత్తిపాడు గ్రామ సచివాలయం-3 కార్యాలయం కోసం నిర్మించిన భవనం ఇది. భవనం నిర్మించి తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. ఊరికి దూరంగా నిర్మానుష్యంగా ఉండడంతో జూదరులు, మందు బాబులు దీనిని తమ అడ్డాగా మార్చుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవన నిర్మాణం పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



ఏలేశ్వరంలో జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



ప్రత్తిపాడులో తిరంగా ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలో గురువారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత ఆధ్వర్యంలో కళాశాల నుంచి దిబ్బలపాలెం, హనుమాన్ జంక్షన్, బాలాజీ చౌక్, యర్రవరం రోడ్డు మీదుగా విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు 79వ స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు జోహారులు అర్పిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో తిరంగా ర్యాలీ

ప్రత్తిపాడు: గ్రామంలో గురువారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఊటా వీరబాబు ఆధ్వర్యంలో స్థానిక నంది సెంటర్ నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకూ ర్యాలీ కొనసాగింది. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు, కంద వీరాస్వామి, పెనుపోతుల రమేష్, కించు జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.